సాక్షి గుంటూరు

బుధవారం । 13 । ఆగస్టు । 2025



నెమలి పింఛాల అలంకరణలో కనక దుర్గమ్మ

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం నెమలి పింఛాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



18 నుంచి టీటీడీ పవిత్రోత్సవాలు

వెంకటపాలెం(తాడికొండ): ఈ నెల 18 నుంచి 21 వరకు వెంకటపాలెంలోని టీటీడీలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పర్యవేక్షణాధికారి మల్లిఖార్జున తెలిపారు.

అష్టలక్ష్మికి కుంకుమార్చన



తెనాలి: స్థానిక కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. నిర్మలా నందగిరి స్వామి ఆశీస్సులతో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఈ వేడుక జరిపించారు.

న్యూస్‌రీల్

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్



గుంటూరు లీగల్: సెప్టెంబరు 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరగనుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఆధ్వర్యంలో ఆర్థిక సంస్థలు, బీమా సంస్థల అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. స్టేక్ హోల్డర్స్, ప్రతినిధులు సహకరించాలన్నారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు, మూడవ అదనపు జిల్లా జడ్జి సి.హెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు , రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ సలహాలు, సూచనలు చేశారు. క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా మంగళవారం గుంటూరు ఆర్డీవో కార్యాలయంలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ సందర్శించారు.

పార్శిల్ డెలివరీ బాయ్‌పై కత్తితో దాడి




పెదకాకాని: సెల్‌ఫోన్ డెలివరీ చేసేందుకు వచ్చిన వ్యక్తిపై గొడవకు దిగి కత్తితో దాడి చేయడంతో అపస్మారకస్థితికి చేరుకున్న సంఘటన నంబూరులో చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన మధిర అవినాష్ క్యాష్ ఆన్ డెలివరీ కండీషన్స్‌తో ఆగస్టు 1వ తేదీన ఆన్‌లైన్‌లో ఫోన్ బుక్ చేశాడు. గుంటూరు చౌత్రా సెంటర్‌కు చెందిన కొత్తమాసు శ్రీనివాసరావు గత కొంతకాలం నుంచి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మధిర అవినాష్ ఆర్డర్ చేసిన ఫోన్‌ను డెలివరీ చేసేందుకు మంగళవారం శ్రీనివాసరావు ఫోన్ చేశాడు. దీంతో ఆ యువకుడు గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌లో శివారు ప్రాంతంలోని టుబాకో గోడౌన్ వద్దకు రావాలని లోకేషన్ షేర్ చేయడంతో శ్రీనివాసరావు అక్కడకు చేరుకున్నాడు. డబ్బులు ఇవ్వకుండా తన వద్ద ఉన్న కత్తితో శ్రీనివాసరావుపై అవినాష్ దాడి చేశాడు. అనంతరం ఫోన్ లాక్కొని పారిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న శ్రీనివాసరావును కొద్దిసేపటి తర్వాత చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ 'వీడియో' వాస్తవమే

సోషల్ మీడియా వేదికగా టీడీపీ నాయకురాలు సూఫియా ఆరోపణ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, ఆ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుడిపల్లి వాణిలు మాట్లాడుతున్నట్లు సోషల్ మీడియాలో వైరలైన వీడియో నిజమైనదేనని టీడీపీ మహిళా నేత షేక్ సూఫియా ఆరోపించారు. వీడియోను వాణి భర్త నవీన్‌కృష్ణ బయటపెట్టారని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆమె మంగళవారం ఒక వీడియోను విడుదల చేశారు. గుంటూరు కొత్తపేట పోలీసులు సూఫియాను స్టేషన్‌కు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని సమాచారం. ఆఖరికి ఆమె పిల్లల సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు కూడా తీసుకొచ్చారు. పోలీసులు వేధింపులు తాళలేక ఆమె సోషల్‌మీడియాలో వీడియో రిలీజ్ చేశారని తెలిసింది.

ఘనంగా వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, గరికతో విశేషాలంకారం చేశారు.

పర్యావరణహిత ఏపీ లక్ష్యం

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్
- గుంటూరులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు శ్రీకారం
- అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు

'ప్లాస్టిక్' అనర్థాలపై చైతన్యం పెరగాలి



చిన్నారులకు క్లాత్‌బ్యాగును అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి, హరి జవహర్‌లాల్, రామారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అందరూ చైతన్యం పెంచుకోవాలని, పర్యావరణహిత ఏపీ అందరి లక్ష్యం కావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వార్ ఆన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రాజెక్టులో భాగంగా 'ఆంధ్రప్రదేశ్ క్లైమెట్ యాక్షన్ ప్లాన్-అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ క్యాంపెయిన్'ను మంగళవారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యా, రాజకీయ, సామాజిక, సాహిత్య రంగాల్లో చైతన్యవంతమైన గుంటూరులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమానికి నాంది పలకడం గొప్ప విషయమన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన గొప్ప నాయకులను అందించిన, ఆచార్య నాగార్జునుని బోధనలతో చైతన్యవంతమైన నేల ఇదని అన్నారు. నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై సమాజాన్ని చైతన్యపరచాలన్నారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. అందరూ ఇళ్లలో ప్లాస్టిక్ వినియోగం నిలిపివేస్తేనే భావి తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం ప్రపంచ తలసరి ప్లాస్టిక్ వినియోగం సగటున 28 కిలోలు ఉండగా, దేశంలో 11 కిలోలుగా ఉందని చెప్పారు. దేశంలో ఏటా 3.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై 2021లో చేసిన చట్టం ద్వారా గుర్తించబడిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం వలన వాటిలోని హానికారకమైన రంగులు, రసాయనాలతో భూమితోపాటు నీటి నాణ్యత క్షీణిస్తోందని తెలిపారు. విద్యార్థులతో ప్రారంభించిన ఈ ప్రచారం ఇళ్లు, మార్కెట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతోపాటు ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. స్వచ్ఛంద సేవకులు, పౌర సమాజం ఉమ్మడి లక్ష్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. భాగస్వాములైన అందరి కృషిని అభినందించారు.

కార్యాచరణ ప్రణాళికతో ప్రాజెక్టు

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, కోశాధికారి పి. రామచంద్రరాజు ఈ ప్రాజెక్టు రూపకల్పన, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. దీనికి విశేష కృషి చేసిన పి.రామచంద్రరాజును గవర్నర్ అభినందించారు. గుంటూరులోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో రూపొందించిన వీడియో గీతం ఆహూతులను ఆకట్టుకుంది. విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా జూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో గవర్నర్ ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బి.రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వడ్లమాని రవి, వలంటీర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించనున్న విద్యార్థులు

మొదటి దశలో రాష్ట్రంలోని 52 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 5 వేల మంది విద్యార్థులు 50 వేల గృహాలను దత్తత తీసుకుంటారని తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం పది గృహాలను సందర్శించి వాయు, నీటి కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా చూడటం, ఘన వ్యర్థాలను వేరు చేయడంతోపాటు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తారని అన్నారు. రాష్ట్రంలోని 172 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి లక్ష మంది యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్ల భాగస్వామ్యంతో 10 లక్షల గృహాలను దత్తత తీసుకోవడం లక్ష్యమన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం కృషి చేయాలని విద్యార్థులకు, యువతకు పిలుపునిచ్చారు.

చంద్రబాబు జేబు సంస్థగా ఈసీ

వైఎస్సార్ సీపీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి ధ్వజం



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ చంద్రబాబు జేబు సంస్థగా పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ధ్వజమెత్తారు. గుంటూరులో పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎన్నికల సరళిలో టీఎన్ శేషన్ ఎంతటి శక్తివంతమైన చర్యలు తీసుకువచ్చారో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ చేతిలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రంలోని ఎస్ఈసీ చంద్రబాబు జేబు సంస్థగా పనిచేస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీని మానసికంగా బలహీనపరిచేందుకు కూటమి ప్రయత్నిస్తోందన్నారు. ఈవీఎంలతో చంద్రబాబు గెలిచాడనే భావన ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. పులివెందులతో జడ్పీటీసీ ఎన్నికలకు గెలిచి సాధించేది ఏముందీ.. అని ప్రశ్నించారు. మేం అధికారంలో ఉన్నప్పుడు ఇదే విధంగా వ్యవహరిస్తే మీరు పోటీ చేసే వారా అని ప్రశ్నించారు. పులివెందుల ఎన్నికల రభసలో రాష్ట్ర ప్రభుత్వం కంటే ఎన్నికల కమిషన్‌దే తప్పని స్పష్టం చేశారు. తొత్తుల్లా పని చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా, ఇప్పటికే హెచ్చరించారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మనసుతో ఓటు గెలుచుకోవాలి గానీ, భయపెట్టి కాదని హితవు పలికారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కచ్చితంగా అధికారంలో వస్తుందని, ఇప్పుడు తొత్తులుగా పనిచేసిన వారందరికీ గుణపాఠం తప్పక చెప్తామన్నారు.

వైభవంగా స్వాతంత్ర్య వేడుకలు

- అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి
- జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: స్వాతంత్ర్య దినోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. మంగళవారం స్థానిక డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఈ వేడుకలు స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అతిథులకు సీటింగ్‌తోపాటు, ఆహుతులు కూర్చునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకునేవిధంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిబింబించే విధంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్టాల్స్‌లో ప్రజలు కొనుగోలు చేసేవిధంగా ఉత్పత్తులను సరిపడా ఉంచాలన్నారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం గడ్డిపాడు రైల్వే గేటు నుంచి తొమ్మిది అడుగులు వెడల్పు, పది కిలో మీటర్ల పొడవు ఉన్న జాతీయ జెండాతో ర్యాలీ చేపడతామన్నారు. రాలీలో అందరూ పాల్గొనే విధంగా చూడాలన్నారు. డీఆర్ఓ షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీఆర్ఎం కార్యాలయంలో

'హర్ ఘర్ తిరంగా'



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్ఎం సుదేష్ట సేన్

ర్యాలీ ప్రారంభించిన డీఆర్ఎం సుదేష్ట సేన్

లక్ష్మీపురం: ప్రతి పౌరుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం సుదేష్టసేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా వేడుకలు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంపై అవగాహన పెంపొందించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రతి పౌరుడు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి త్యాగాలను మరువకూడదన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రతి ఒక్కరూ హర్‌ఘర్ తిరంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. అనంతరం పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయం నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వరకు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్ కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబు, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆర్పీఎఫ్ సైలేషన్ కుమార్, డివిజన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' అమరవీరులకు ఘన నివాళి

- స్తూపాల వద్ద నివాళులర్పించిన మంత్రి మనోహర్
- బహిరంగ సభలో పలు రంగాల ప్రముఖులకు సత్కారం



అమరవీరుల స్తూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి, తెలుగు తల్లికి నమస్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహా, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా తెనాలిలో 1942 ఆగస్టు 12న జరిగిన నిరసనలో పోలీసుల కాల్పుల్లో కన్నుమూసిన ఏడుగురు అమరవీరులకు మంగళవారం ఘన నివాళి అర్పించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన వీర సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి తదితరులు రణరంగచౌక్‌లోని అమరవీరుల స్తూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. ముందుగా అన్నాబత్తుని పురవేదిక నుంచి ర్యాలీగా బయలుదేరి రణరంగ్ చౌక్‌కు చేరుకున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసులు కవాతుగా తరలి వచ్చారు. మంత్రి నాదెండ్ల మనోహర్ అక్కడి తెలుగు తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తదుపరి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విశేష సేవలందించిన ప్రముఖులకు, స్వాతంత్ర్యోద్యమంలో అసువులుబాసిన వారి కుటుంబ సభ్యులకు సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో సమర యోధుడు షేక్ అబ్దుల్ వహాబ్ కోడలు షేక్ నూర్జహాన్, మరో సమర యోధుడి కుమారుడు షేక్ కరిముల్లా, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, హెల్పింగ్ సోల్జర్స్ ఇనయతుల్లా, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, మాజీ సైనికోద్యోగి అనంతగిరి ఏడుకొండలరావులు ఉన్నారు. నృత్యగురువులు ఎ.వెంకటలక్ష్మి, ఆరాధ్యుల తేజస్విప్రఖ్యల శిష్యబృందం వివిధ నృత్యాంశాలను, 'మా తెలుగు తల్లి' నృత్యరూపకాన్ని ప్రదర్శించింది.

భౌతికంగా దూరమై.. ఔదార్యంతో సజీవమై..

- రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్
- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబసభ్యులు
- అవసరమైన ఐదుగురికి అమర్చడంతో వారికి పునర్జన్మ



ముద్దన వెంకటరావు (ఫైల్)

గుంటూరు మెడికల్: బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన ముద్దన వెంకటరావు (62) ఈ నెల 9వ తేదీన పర్చూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు తరలించారు. అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి యాజమాన్యం జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులకు తెలిపింది. వారు రోగి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. వెంకటరావు అవయవాలు మరో ఐదుగురి ప్రాణాలను కాపాడగలవని తెలిపారు. కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి అవయవాలు సేకరించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి వాటిని అమర్చి నూతన జీవితాలు ప్రసాదించారు. కాలేయం, ఒక మూత్రపిండాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న వారికి అమర్చారు. మరో కిడ్నీని విజయవాడ విజయా హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న రోగికి అమర్చారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు కళ్లను తరలించారు. అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు అభినందించారు. అవయవాల సేకరణ, గ్రీన్ చానెల్ ద్వారా వాటిని సంబంధిత ఆసుపత్రులకు చేరవేయడాన్ని డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.మమత రాయపాటి, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ చౌదరి మాట్లాడుతూ, ఆగస్టు నెలలో బ్రెయిన్‌డెడ్ అయిన ముగ్గురి నుంచి అవయవాలను సేకరించి అవసరమైన రోగులకు విజయవంతంగా మార్పిడి చేసి ప్రాణాలు కాపాడామన్నారు.

గంజాయి కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరిక
- ఈగల్ సెల్ సమన్వయంతో విస్తృత సోదాలు చేస్తున్నట్లు వెల్లడి
- రెండుకుపైగా కేసుల్లో నిందితులైన వారిపై 'జియో ట్యాగింగ్' నిఘా
- గతంలో పట్టుబడిన గంజాయిని దహనం చేసిన పోలీసులు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో ఈగల్ సెల్ ఎస్పీ నగేష్‌కుమార్ తదితరులు

నగరంపాలెం: గంజాయి కేసుల్లో చిక్కిన నిందితులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలోని పదిహేడు పోలీస్ స్టేషన్లల్లో 2016–24 వరకు నమోదైన 113 కేసుల్లో సీజ్ చేసిన 1,868 కిలోల గంజాయి (ఆకు), 2,233 లీటర్ల లిక్విడ్ గంజాయి, 0.023 గ్రాముల ఎండీఎం, ఇతర సింథటిక్ మాదక ద్రవ్యాలను దహనం చేశామని తెలిపారు. నగరంపాలెం పోలీస్ కల్యాణ మండపంలో మంగళవారం ఈగల్ సెల్ ఎస్పీ నగేష్‌కుమార్, జిల్లా ఏఎస్పీ (ఎల్/ఓ) ఏటీవీ రవికుమార్‌తో కలిసి జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటిదాకా 44 కేసులు నమోదవ్వగా, 143.96 కిలోల పొడి గంజాయి, 1.172 లీటర్ల ద్రవ గంజాయి, 500 గ్రాముల హైడ్రో గంజాయి, ఇతరత్రా మాదక ద్రవ్యాలను తక్కువ పరిమాణంలో స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ కేసుల్లో 219 మంది నిందితులకు 173 మందిని అరెస్టు చేశామన్నారు. వీరంతా 14– 40 ఏళ్లలోపు వయసు వారు అని చెప్పారు. 107 మంది 25 ఏళ్ల కంటే తక్కువ వయసు వారేనని అన్నారు. గంజాయి సంబంధిత నేరాలకు పాల్పడే వారికి శిక్షలు విధించేందుకు పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం ఉందన్నారు. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై ఈ చట్టం కింద ఒక ఏడాది వరకు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. ఈగల్ సమన్వయంతో సోదాలు చేస్తున్నామని పేర్కొన్నారు. రెండుకుపైగా కేసుల్లో నిందితులుగా ఉన్న 82 మందిని గుర్తించగా.. పది మందికి జియో టాగింగ్ పెట్టామని చెప్పారు. తద్వారా వారెవరితో కలుస్తున్నారు, ఎక్కడకెళ్తున్నారు, ఏజెన్సీ ప్రాంతాల్లోకి వెళ్తున్నారా అనే కోణంలో విచారిస్తున్నామని అన్నారు. ఒడిశా, మల్కాన్‌గిరి నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో 36 మాదకద్రవ్య దుర్వినియోగ హాట్‌స్పాట్‌లు గుర్తించినట్లు తెలిపారు. ఆ ప్రాంతాలపై నిఘా ఉందన్నారు. నగర, శివార్లల్లో నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన భవనాలు, నిర్మాణాలను కూల్చివేయాలని జీఎంసీ అధికారులకు దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యుత్ లేని ప్రదేశాల్లో దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపామని అన్నారు. ఈగల్ సెల్ విభాగం ఎస్పీ నగేష్‌బాబు మాట్లాడుతూ ఇప్పటిదాకా 68 వేల కిలోల గంజాయి సీజ్ చేశామన్నారు. వాటిని ధ్వంసం చేసేందుకు జిల్లాల్లో బృందాలను నెలకొల్పామని అన్నారు. ఈగల్ ఏర్పాటయ్యాక గంజాయి నిర్మూలనకై ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు డ్రగ్స్ వద్దు బ్రో, సేఫ్ క్యాంపస్ జోన్, ఆపరేషన్ ఎన్నారై స్టడ్స్ వంటి నూతన అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఇటీవల తెనాలిలో కొన్ని హాట్‌స్పాట్‌ను పరిశీలించామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంటుందని అన్నారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, సీఐలు రాజశేఖర్‌రెడ్డి (డీటీసీ), విక్టర్ (ఈగల్) తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిందాల్ ప్లాంట్ వారి సహకారంతో ఓబులునాయుడుపాలెం సమీపంలోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌లో గంజాయి తదితరాలను దహనం చేశారు.